క్లుప్తంగా

ఓటర్ల జాబితాపై నేడు సమీక్ష

హుజూర్‌నగర్ : పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఓటర్ల జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులపై సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. సమావేశానికి పీసీసీ డెలిగేట్స్, డీసీసీ ఆఫీస్ బేరర్లు, బ్లాక్, మండల, పట్టణ, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



నారాయణ కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, నిరుపేద దారా నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. శుక్రవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నారాయణ కుటుంబసభ్యులకు రూ.11 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండునాయక్, మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్, సీనియర్ నాయకులు శాగంరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వాలీబాయి, లింగయ్య, వినోద్‌నాయక్, కోటయ్య, రాము, సీతమ్మ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై కళాజాతా



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకట్‌రెడ్డి

గరిడేపల్లి : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో శుక్రవారం షీటీమ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై కళాజాతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గరిడేపల్లి ఎస్ఐ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సోషల్ మీడియా వినియోగం, ఓటీపీ ఫ్రాడ్స్, సైబర్ నేరాలు, టోల్ ఫ్రీ నెంబర్ 1930, సెల్ ఫోన్‌తో అనార్థాలపై వివరించారు. విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా సన్మార్గంలో నడవాలన్నారు. మహిళలు, పిల్లలు సమస్యలు ఎదురైతే 100కు డయల్ చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ పాండునాయక్, హెడ్ కానిస్టేబుళ్లు యల్లారెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్ శైలజ, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, చారి, గురులింగం, విద్యార్థులు ఉన్నారు.

నూతన తహసీల్దార్ ఆంజనేయులుకు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు

మునగాల : మునగాల మండల నూతన తహసీల్దార్ ఆంజనేయులును శుక్రవారం ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో నెలకొన్న దీర్ఘకాల సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏపూరి రాజు మాదిగ, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి అంజయ్య, మండల శాఖ అధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్, ఎంఈఎఫ్ నాయకులు రెమిడాల లింగయ్య, కత్తి కోటయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీను, లచ్చయ్య పాల్గొన్నారు.

నకిలీ వెబ్‌సైట్‌లతో మోసపోవద్దు

పాలకవీడు : పీఎం కిసాన్ ట్రాక్టర్ యోజన పథకం అనే వెబ్‌సైట్ ఫేక్ అని మండల వ్యవసాయ అధికారి బి.రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాభై శాతం సబ్సిడీతో రైతులకు కేంద్ర ప్రభుత్వం ట్రాక్టర్ ఇస్తుందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న నకిలీ ప్రోమోలు, వెబ్‌సైట్‌లను చూసి మోసపోవద్దని సూచించారు. కేంద్ర ప్రభుత్వం 2020లోనే ఈ పథకం నకిలీదంటూ తేల్చి చెప్పిందన్నారు. కొందరు కేటుగాళ్లు పథకాల పేరుతో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని, రైతులను ట్రాప్ చేసి ఖాతాల్లో డబ్బులు కాజేస్తున్నారని ఈ విషయాల్లో రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. రైతులకు ప్రభుత్వ పథకాలను వ్యవసాయశాఖ అమలు చేస్తుందని, ఏదైనా వివరాలు వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. రైతులు ఆన్‌లైన్‌లో తమ వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దన్నారు.

నేడు గ్రామాల్లో హరితహారం

నడిగూడెం : స్వాతంత్య్ర వజ్రోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని గ్రామాల్లో నిర్వహించబోయే మొక్కలు నాటే కార్యక్రమాన్ని (హరితహారం) విజయవంతం చేయాలని ఎంపీడీఓ యం.యర్రయ్య శుక్రవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రభుత్వ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

వానలు కురవక.. నీరు పోయక

ఎండిపోతున్న మెగా పల్లె ప్రకృతి వనం

- నీటి సౌకర్యం లేని చోట ఏర్పాటు
- భూగర్భజలాలు అడుగంటి పొలాలకే సరిపోని బోరు, బావుల నీరు
- రైతులు నీరివ్వక 20 రోజులుగా మాడిపోతున్న చెట్లు
- చోద్యం చూస్తున్న అధికారులు



చిలుకూరులోని మెగా పల్లె ప్రకృతి వనంలో ఎండిపోతున్న చెట్లు

చిలుకూరు : మండల కేంద్రంలోని మెగా పల్లె ప్రకృతి వనంలో చెట్లు ఎండిపోతున్నాయి. వర్షాలు కురవకపోవడం, ఎండలు మండిపోతుండడంతో మొక్కలు రోజురోజుకూ మాడిపోతున్నాయి. మండల కేంద్రానికి సమీపంలోని గుట్టల్లో ఈ వనాన్ని ఏర్పాటు చేశారు. దీంతో అక్కడ నీటి సౌకర్యం లేకపోవడంతో మొక్కలు నాటిన నాటి నుంచి నేటి వరకు గ్రామ పంచాయతీ ట్యాంకర్‌తోనే వారానికి రెండు సార్లు నీరు పోస్తూ చెట్లను బతికిస్తున్నారు. కాగా నెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. సుమారుగా 500కు పైగా మొక్కలు ఎండిపోయినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

పంట పొలాలకు నీరు సరిపోక..

కాగా, వరి నాట్లకు వేయకముందు వనానికి సమీపంలోని బావుల్లో నీటిని గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా తీసుకొచ్చి చెట్లకు పోసేవారు. కానీ ప్రస్తుతం బావుల్లో నీళ్లు వరి పొలాలకే సరిపోకపోవడంతో రైతులు నీరివ్వక వనంలోని చెట్లకు పోసే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో చెట్లకు దాదాపుగా 20 రోజులుగా నీళ్లు లేవు. ఇలాగే మరి కొన్ని రోజులు ఉంటే చెట్లు దాదాపుగా ఎండిపోతాయని అధికారులే అంటున్నారు. కాగా మొక్కలు నాటేందుకు లక్ష రూపాయలకు పైగా ఖర్చు పెట్టారు. సంబంధిత అధికారులు స్పందించి చెట్లు ఎండిపోకుండా నీటి కోసం ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కోరుతున్నారు.

వివాదాల నడుమ ఏర్పాటు

మెగా ప్రకృతి వనం ఏర్పాటు చేసే సమయంలో పలు వివాదాలు తలెత్తినా మొత్తానికి వనం ఏర్పాటు చేశారు. గుట్టల్లో మొక్కలు బతకవని అక్కడ వద్దని కొందరు, ఎక్కాడా స్థలం లేదు చేసేదేమి లేదని అధికారులు ఇలా పలు వివాదాల మధ్య ఏడాది క్రితం మెగా పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. రాళ్ల మధ్యలో మొక్కలు నాటారు అవి ఎలా బతుకుతాయని ప లువురు ప్రజాప్రతినిధులు మొదటి నుంచే అంటున్నారు. అయినా ఉన్నతాధికారుల ఆదేశాలతో తప్పని పరిస్థితిలో పల్లె ప్రకృతి వనంలో ఏ ర్పాటు చేసి సుమారుగా 2 వేల మొక్కలు నాటారు.

నీటి కొరత ఏర్పడింది



మెగా పల్లె ప్రకృతి వనంలో నీటి సౌకర్యం లేదు. కానీ ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోస్తూ చెట్లను బతికిస్తున్నాం. నెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో నీటి సమస్య వచ్చింది. బయట నీళ్లు దొరకడం లేదు. దీంతో చెట్లు కొంత ఎండిపోతున్న మాట వాస్తవమే. చెట్లు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటాం

– ఈదయ్య, ఎంపీడీఓ, చిలుకూరు

ఇళ్ల స్థలాల పట్టాలు ఇప్పిస్తా : ఎమ్మెల్యే



హుజూర్‌నగర్ : పేదలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



నేరేడుచర్ల : శివాని తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : పట్టణంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి హామీ ఇచ్చారు. రోడ్ల వెడల్పులో ఇళ్లు కోల్పోయిన, ఇళ్లు లేని నిరుపేదలు శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారితో మాట్లాడుతూ రామస్వామి గుట్ట వద్ద సర్వే చేయించి అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయిస్తామని చెప్పారు. అదే విధంగా కాలువలపై ఆవాసాలు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఇళ్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేకు వీఏఏల సన్మానం..

హుజూర్‌నగర్ అసెంబ్లీ టికెట్ సాధించిన ఎమ్మెల్యే సైదిరెడ్డిని శుక్రవారం నేరేడుచర్ల మండల, హుజూర్‌నగర్ వీఏఏలు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

శివాని కుటుంబానికి అండగా ఉంటాం

నేరేడుచర్ల : హుజూర్‌నగర్‌లోని బీసీ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడెంకు చెందిన జిల్లోజు శివాని ఇటీవల ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం బక్కయ్యగూడెంలో శివాని కుటుంబాన్ని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పరామర్శించారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రెండు లక్షల రూపాయల చెక్కును శివాని తల్లిదండ్రులు ధనలక్ష్మి, వీరయ్యాచారిలకు అందజేశారు. శివాని తల్లి ధనలక్ష్మికి అటెండర్ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన గురుకుల పాఠశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ మీరాబాయిని సస్పెండ్ చేయించినట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్డీఓ జగదీశ్‌రెడ్డి, తహసీల్దార్ సైదులు, ఎంపీపీ లకుమళ్ల జ్యోతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, సర్పంచ్ కవిత, ఉప సర్పంచ్ కరుణం నర్సయ్య, నాయకులు అరవింద్, రామయ్య, తదితరులు ఉన్నారు.

వయోవృద్ధులు ఇంటి నుంచే ఓటేయొచ్చు

- ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

హుజూర్‌నగర్ : రానున్న ఎన్నికల్లో వయోవృద్ధులు ఇంటి నుంచే ఓటేయొచ్చని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో ఓటు వినియోగంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగం, ఈవీఎం కంట్రోల్ యూనిట్‌లపై సీనియర్ సిటిజన్లకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వయోభారంతో పోలింగ్ బూతులకు రాలేని 80 ఏళ్ల పైబడిన వారు, వికలాంగులు ఇంటి నుంచే ఓటెయొచ్చని, దీని కోసం ముందే 12డీ ఫారం నింపి ఎన్నికల అధికారులకు ఇవ్వాలని సూచించారు. జిల్లా ఎన్నికల నోడల్ అధికారి రామారావు మాట్లాడుతూ వచ్చే నెల 18 వరకు నూతన ఓటు నమోదుకు అవకాశం ఉందన్నారు. అనంతరం ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పశ్య గురువారెడ్డి, అంకతి అప్పయ్యలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జునరెడ్డి, పెన్షనర్ల సంఘం నాయకులు మోహినొద్దీన్, వి.నరసయ్య, కేవీఎస్‌మూర్తి, ఎ.చంద్రయ్య, లలిత, జె.నర్సిరెడ్డి, దేవన్న, ఎస్.వెంకటేశ్వరరావు, ధర్మారి, లక్ష్మయ్య, ఎంఎస్ఎన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తులు



గాంధీ భవన్‌లో టికెట్ కోసం దరఖాస్తు అందజేస్తున్న పిల్లుట్ల రఘు

హుజూర్‌నగర్ : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హుజుర్‌నగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు టికెట్ కోసం శుక్రవారం దరఖాస్తు చేసుకున్నట్లు ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గం నుంచి తాను కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ టికెట్ కోసం గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. గత కొంతకాలంగా నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తనకు ఖచ్చితంగా అవకాశం ఇస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఏహెచ్ఆర్ ఫౌండేషన్ అధినేత అన్నపురెడ్డి అప్పిరెడ్డి హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసేందుకు టికెట్ కోసం గాంధీ భవన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

జీఎమ్మార్ నిర్లక్ష్యం.. డ్రెయినేజీ అధ్వానం



కనకదుర్గ ఆలయం ఎదురుగా మురుగు కాలువ ఇలా..

మునగాల : మండల కేంద్రంలోని శ్రీకనకదుర్గ దేవాలయం ఎదురుగా గల సర్వీసు రోడ్డు పక్కన జీఎమ్మార్ సంస్థ నిర్మించిన మురుగుకాలువ అధ్వానంగా తయారైంది. మురుగు కాలువలో పూడిక తీయకపోవడంతో చెత్తచెదారంతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. నాలుగు నెలల క్రితం పూడిక తీత పనుల్లో భాగంగా మురుగు కాలువపై గల మూతలను జీఎమ్మార్ సంస్థ తొలగించింది. కానీ పూడిక తీత పనులు పూర్తిచేయకుండా, మూతలు వేయకుండా అలాగే వదిలివేయడంతో మురుగు కాలువ పూడిపోయి దుర్గంధం వెలువడుతోంది. ప్రస్తుతం శ్రావణమాసం కావడంతో దేవాలయానికి వస్తున్న భక్తులతో పాటు ఈ ప్రాంతంలో ఉన్న వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు జీఎమ్మార్ సంస్థ ప్రతినిధులకు తెలియజేసినా వారు పట్టించుకోవడం లేదని, రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్థానిక సర్పంచ్ చింతకాయల ఉపేందర్ తెలిపారు.

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో అనధికారికంగా నిర్వహిస్తున్న పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయ అధికారులు రెండో రోజు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని, అనధికారికంగా పురుగు మందులు అమ్ముతున్నారని పలు పెస్టిసైడ్ కంపెనీల ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. దీంతో వ్యవసాయ అధికారులకు దుకాణాలు, గోదాములను తనిఖీ చేసి సీజ్ చేసిన సంగతి తెలిసిందే. కాగా గురువారం మూసి ఉంచిన లక్ష్మీ సీడ్స్ షాపును శుక్రవారం తనిఖీ చేసి సీజ్ చేశారు. దుకాణంలో సీజ్ చేసిన పురుగు మందుల మొత్తం విలువ రూ.50.93 లక్షల వరకు ఉంటుందని ఏఓ స్వర్ణ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా జనపనేని కృష్ణారావు



నియామకపత్రం అందుకుంటున్న కృష్ణారావు

కోదాడరూరల్ : టీడీపీ కోదాడ పట్టణ అధ్యక్షుడిగా జనపనేని కృష్ణారావును నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నియామక పత్రం అందజేశారు. శుక్రవారం కోదాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణారావు మాట్లాడారు. పట్టణంలో పార్టీ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నంబూరి సూర్యం, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒరుగంటి ప్రభాకర్, భయ్యా నారాయణ, వెంకటేశ్వరరావు, నర్సయ్య, నాగేశ్వరరావు, గుర్వయ్య, రాములు తదితరులు న్నారు.

యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

చిలుకూరు : మండలంలోని గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 26, 27, వచ్చే నెల 2, 3వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సరిత తెలిపారు. శుక్రవారం చిలుకూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గ్రామాల్లోని బీఎల్‌ఓలకు గాని తహసీల్దార్ కార్యాలయంలోనైనా దరఖాస్తు పత్రాలు అందజేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐలు మంజుల, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాగ్యరెడ్డి హౌస్ అరెస్ట్

హుజూర్‌నగర్ : సూర్యాపేటలోని జిల్లా కలెక్టర్ కార్యాలయ ముట్టడికి వెళ్లనున్న భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డిని శుక్రవారం చింతలపాలెం మండలంలోని దొండపాడు గ్రామంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అదే విధంగా మండలంలోని పలువురు బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి చింతలపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ నాయకులు పి.విజయ్, కె.లింగరాజు, నాగరాజు, నరసింహారావు, గోపి, ప్రదీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రత పూజలు



నేరేడుచర్ల శివాలయంలో వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్న మహిళలు



హుజూర్‌నగర్‌రూరల్: శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహవేణుగోపాలస్వామి ఆలయంలో..

నేరేడుచర్ల : నేరేడుచర్లలోని శివాలయంలో మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకుడు శివప్రసాద్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో 108 రకాల ప్రసాదాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో వాసవి, వనిత క్లబ్‌ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్త లక్ష్మణ్, వీరవల్లి శ్రీలత, కోటేశ్వర్‌రావు, సంధ్య, భాగ్యలక్ష్మి, శ్రీనివాస్‌రావు, గోపాలకృష్ణ, కోటేశ్వర్‌రావు, సత్యం, నాగలక్ష్మి, అనూష, జ్యోతి, పద్మ, కరుణ, అంజయ్య, రాధిక, రజనీ తదితరులు ఉన్నారు.

బూరుగడ్డ ఆలయంలో..

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో వరలక్ష్మి వ్రతాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, ఆరగింపు, మంగళాశాసనం అనంతరం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సహస్రనామ కుంకుమార్చన, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ లక్ష్మణరావు, ధర్మకర్తలు సురభి కుషల్, కామిశెట్టి స్వామి, భిక్షం, అయోధ్య, సూర్య, మల్లికార్జున్, శ్రీనివాస్, అర్చకులు మనోహరాచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మఠంపల్లి : మండల కేంద్రంలోని దుర్గానగర్‌లో గల శ్రీకనకదుర్గమ్మ దేవాలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతిపూజ, గౌరీపూజ, కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు బ్రహ్మశ్రీ సోమయాజుల లక్ష్మీనరసింహశాస్త్రి, సూర్యానారాయణమూర్తిశాస్త్రి, మహిళలు పాల్గొన్నారు.

మునగాల : మండల కేంద్రంతో పలు గ్రామాలలో శుక్రవారం మహిళలు వరలక్ష్మి వ్రతం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయం, శ్రీకనకదుర్గ ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిలుకూరు : మండల కేంద్రంతో అన్ని గ్రామాలలో శుక్రవారం శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలువురు మహిళలు తమ ఇళ్లలో వరలక్ష్మి వ్రతం చేశారు.



మఠంపల్లి : కనకదుర్గ ఆలయంలో..



మునగాల : శ్రీరామలింగేశ్వర హనుమాన్ ఆలయంలో..



చిలుకూరులో..

గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న వేదపండితులు, గ్రామస్తులు

మఠంపల్లి : మండలంలోని సుల్తాన్‌పూర్‌తండాలో గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీసేవాలాల్ మహరాజ్, మహాలక్ష్మి, నాభిశిల (బొడ్రాయి), ముత్యాలమ్మ గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను గురుస్వామి అద్దేపల్లి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా ప్రారంభించారు. ఈనెల 27వరకు ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతాయని, ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు, విగ్రహాలకు జలాభిషేకాలు, ఊరేగింపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 27న ఉదయం యంత్ర బింబస్థాపనలతో విగ్రహ ప్రతిష్ఠలు చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సర్పంచ్, వికలాంగులు

చిలుకూరు : వికలాంగులకు ఆసరా పెన్షన్ పెంచడాన్ని హర్షిస్తూ శుక్రవారం చిలుకూరు మండలంలోని సీతారాంపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వికలాంగులు సర్పంచ్ పులగం రవీందర్‌తో కలిసి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేదలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అవినాష్‌రెడ్డి, గ్రామ పెద్దలు కుర్రా వెంకటయ్య, సత్యనారాయణ, ముత్తయ్య, పిల్లుట్ల ఆదినారాయణ, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ ఫండ్‌తో అభివృద్ధి పనులు



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న దెక్కన్ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం, ప్రజాప్రతినిధులు

పాలకవీడు : మండలంలోని మహంకాళిగూడెం గ్రామంలో సీసీరోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులను డెక్కన్ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశ్రమ జీఎం నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ సీఎస్ఆర్ ఫండ్ నిధులు రూ.40 లక్షలతో గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలో జాన్‌పహాడ్, కల్మేట్‌తండా, జాన్‌పహాడ్ దర్గా, చెరువుతండా, రావిపహాడ్ గ్రామాల్లో సీఎస్ఆర్ ఫండ్ కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరాజు, సర్పంచ్ ఆరెళ్ల శ్వేత విజయ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా, మండల సభ్యులు మలిమంటి దుర్గారావు, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ యరడ్ల సత్యనారాయణరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎండిపోయిన పంట పొలాల పరిశీలన



గరిడేపల్లి శివారులో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

గరిడేపల్లి : మండల కేంద్రం పరిధిలోని ఎండిపోయిన పంట పొలాలను శుక్రవారం సీపీఎం నాయకులు పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి యాకుబ్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌లో 528 అడుగుల నీరు నిల్వ ఉందని, కావునా సాగర్ ఆయకట్టుకు కనీసం వారాబందీ ప్రకారమైన పంట పొలాలకు సాగునీరు అందించాలని కోరారు. ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటి బోర్లు, బావుల కింద సాగు చేసిన పంట పొలాలు ఎండిపోతున్నాయన్నారు. జిల్లా మంత్రి సాగర్ నీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. వారి వెంట పార్టీ నాయకులు తమ్ముల సైదయ్య, రాణిగూడెం సర్పంచ్ దోసపాటి భిక్షం, కుక్కనూరు అంజయ్య, బండారు రాములు, నరసయ్య, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో తాగునీటి తిప్పలు

- అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కరించాలని ప్రజల వేడుకోలు

మేళ్లచెరువు : వానాకాలం సగానికి వచ్చినా సరైన వానలు కురవకపోవడంతో భూగర్భజలాలు తగ్గముఖం పట్టాయి. దీంతో మండలంలోని హేమ్లాతండా, వెల్లటూరు, యతిరాజపురంతండా, రామాంజనేయ తండా, కప్పలకుంటతండా, వేపలమాధవరం గ్రామ పంచాయతీల పరిధిలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు గ్రామాల పరిధిలోని పొలాల్లో వద్ద గల బావులు, బోర్ల నుంచి తాగు నీరు తెచ్చుకుంటున్నారు. హేమ్లాతండాలో బోరు, బావుల్లో నీరు అడుగంటడం, దీనికి తోడు గ్రామపంచాయతీ బోర్లు మరమ్మతులకు గురవ్వడం, మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో గ్రామంలో తాగు నీటి సమస్యతో తండావాసులు అల్లాడుతున్నారు. ఓవర్ హెడ్ ట్యాంకుకు మోటారు బిగించకపోవడంతో ఇంటింటికీ నల్లా ఉన్నా తాగు నీటి కోసం ఎదురుచూపులు తప్పడం లేదని అంటున్నారు. ఇక వెల్లటూరు గ్రామంలో తాగు నీటి బోర్లు ఎండిపోవడం, మోటార్లు మరమ్మతులకు గురికావడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

గురుకులంలో ఎండిపోయిన బోర్లు

మండల కేంద్రం పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలలో 300 మంది విద్యార్థులు ఉండగా వారికి సరిపడా నీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో గల రెండు బోర్లు ఎండిపోవడంతో ప క్కన వ్యవసాయ భూమిలోని మోటారు ద్వారా విద్యార్థులకు తాగు నీరు అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.